

యుటిఎఫ్ కేలండర్, డైరీ ఆవిష్కరణ



ఎస్ఐకి కేలండర్ ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి -అనంతగిరి : మండల కేంద్రంలో యుటిఎఫ్ కేలండర్, డైరీలను మంగళవారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పుడిగి దేముడు, ఉమ్మడి విశాఖ జిల్లా సహ అధ్యక్షులు శెట్టి రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ కరక రాము, కొత్తవలస బాలుర పాఠశాల హెచ్ఎం కొర్రా అప్పలస్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు వివి.ఈశ్వరరావు, బి సింహాచలం, కార్యవర్గ సభ్యులు బిఎస్ఎన్ పడాల్, కోశాధికారి. బి.విజయకుమార్. కార్యదర్శి ఎస్.గంగరాజు. జె.సత్యనారాయణ, అచ్చిబాబు, కె.రఘు, ఎస్. నగేష్, ఎం.సుబ్బారావు, టి. గుండు, దయానిధి, సంఘం సభ్యులు పాల్గొన్నారు

దున్నపోతులకు వినతి

- ప్రభుత్వ మొండివైఖరిపై అంగన్వాడీల నిరసన
- సమ్మె విరమణకు నోటీసులు జారీపై గరంగరం
- నేడు కలెక్టరేట్ ముట్టడి, దిగ్బంధనానికి పిలుపు
- ఎక్కడికక్కడ ఆందోళనలు



మారేడుమిల్లిలో గేదె దూడకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు



విఆర్.పురంలో నోటీసులను దగ్ధం చేస్తూ నిరసన

తమ సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ అంగన్వాడీలకు దున్నపోతులకు వినతిపత్రాలను ఇచ్చారు. ఈనెల 5 నుంచి విధుల్లో చేరాలని నోటీసులు జారీపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాటిని తిరస్కరించారు. కొన్ని చోట్ల తీసుకున్న నోటీసులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. 3న బుధవారం కలెక్టరేట్‌ల ముట్టడి ఆందోళనకు పిలుపునిచ్చారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ప్రజాశక్తి ముంచంగిపుట్టు: అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య, మొండివైఖరిని నిరసిస్తూ 22రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు మంగళవారం యూనియన్ అధ్యక్షులు ఎస్ ఈశ్వరమ్మ, సిఐటియు జిల్లా నాయకులు కె శంకరరావు ఆధ్వర్యంలో పశువులకు వినతిపత్రాన్ని అందించి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలోనూ, పాదయాత్రలో అక్కచెల్లెమ్మలంటూ అంగన్వాడీలకు మాయ మాటలు చెప్పి, ఇపుడు మొండివైఖరి అవలంభించడం దుర్మార్గమన్నారు. రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీ కార్యకర్తలు బి సత్యవతి,ఎస్ పార్వతి, మౌలమ్మ, సుజాత, కాంతమ్మ , భవాని పాల్గొన్నారు.

థింసానృత్యంతో అంగన్వాడీల ఆందోళన

డుంబ్రిగుడ: అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని హైవేలో యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు రోడ్డుపై థింసా నృత్యం చేస్తూ వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. సంఘం మండల అధ్యక్షురాలు కె.కొండమ్మ, కార్యదర్శి కె.సత్యవతి, జి.పవిత్ర పాల్గొన్నారు.

పెదబయలు : అంగన్వాడీల సమ్మెలో భాగంగా 22వ రోజున మంగళవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బోండా సన్నిబాబు ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు ధర్మన్న పడాల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ర్యాలీ మానవహారం నిర్మించి నిరసన చేపట్టారు. అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వ మొండివైఖరి వీడకపోవడంతోపాటు అంగన్వాడీలకు నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 3న కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు అంగన్వాడీల సమ్మెకు యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్(ఆశ) సిఐటియు నాయకులు లక్కే లక్ష్మి, సుబ్బాలమ్మ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సునీల్ కుమార్, సర్బన్న, అంగన్వాడీల యూనియన్ సిఐటియు నాయకులు టి. రాజమ్మ మంగమ్మ, వరహాలమ్మ, భవాని, సరస్వతి, పద్మ, కొండమ్మ, సుశీల, గంగమ్మ, శాంతి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు.

హుకుంపేట: 22రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 3న జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. సమస్యలపై చర్చలకు పిలిచిన మంత్రుల బృందం, సామరస్య పరిష్కారం చూపకపోగా, వెంటనే విధుల్లో చేరాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవంటూ అధికారులతో నోటీసులు జారీ చేయడంపై మండిపడ్డారు. అంగన్వాడీలతో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సమ్మెలో సిఐటియు మండల కార్యదర్శి టి అప్పలకొండపడాల్, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు. అంగన్వాడీ యూనియన్ నాయకులు అప్పల కొండమ్మ, కృష్ణవేణి, పద్మ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

జి. మాడుగుల: అంగన్వాడీల సమ్మెకు బిజెపి నేత కురుషా పార్వతమ్మ మద్దతు ప్రకటించారు. సమ్మె శిబిరంలో పాల్గొని, అంగన్వాడీలతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిజెపి నేత సతీష్ పడాల్ పాల్గొన్నారు.

అనంతగిరి : న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మెను విరమించేది లేదని నిరవధికంగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలకు పలు ప్రజా రాజకీయ సంఘాలు సంఘీభావం తెలిపాయి. మంగళవారంసమ్మె శిబిరంలో పెద్దఎత్తున నినాదాలు చేస్తూ వినూత్న రీతిలో నిరసన చేపట్టారు.కార్యక్రమంలో అంగన్వాడీలు మంజుల,కళావతి, చిలకమ్మ, సుమిత్ర పాల్గొన్నారు.

చింతూరు : అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు చేస్తున్న సమ్మె 22వ రోజుకు చేరుకుంది. ఆందోళనలో భాగంగా దున్నపోతులకు పత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. అలాగే ఐసిడిఎస్ సిడిపిఓ విజయ్ గౌరి ప్రభుత్వ మెమో ఉత్తర్వులను అంగన్వాడీలకు అందజేయగా, ప్రభుత్వ తాటాకు చప్పట్లకు బెదిరేది లేదని, తమ అన్యాయమైన హక్కులు నెరవేర్చే వరకు ఆందోళన కార్యక్రమాల్ని కొనసాగిస్తామని సిడిపిఓకు ముక్తకంఠంతో అంగన్వాడి కార్యకర్తలు తేల్చి చెప్పారు.కార్యక్రమంలో అంగన్వాడిలు నూక రత్నం, వెంకటరమణ, జయ వసంత, కనకదుర్గ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

అడ్డతీగల : అంగన్వాడీలు సమ్మెలో భాగంగా మంగళవారం గంగిరెద్దుకు ఇచ్చి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. దీక్షా శిబిరానికి ఐసిడిఎస్ అధికారులు వచ్చి అంగన్వాడీ కార్యకర్తలకు మెమో నోటీసు ఇవ్వడానికి ప్రయత్నించగా, అందరూ ముక్కాకంఠంగా తిరస్కరించారు. దీంతో వారు సమ్మె చేస్తున్న ప్రాంతంలో చెట్టుకు అంటించి వెళ్లిపోయారు.

రంపచోడవరం : అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు చేస్తున్న సమ్మె 22వ రోజుకు చేరుకుంది. వీరి ఆందోళనకు సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ సంఘీభావం తెలిపారు. అనంతరం అంగన్వాడి వర్కర్లు దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి తమ నిరసనను తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, అంగన్వాడి నాయకులు కే రామలక్ష్మి, ఎం సత్యవేణి, మంగయ్యమ్మ పాల్గొన్నారు.

మారేడుమిల్లి : 22వ రోజు అంగన్వాడీలు గేదె దూడకు వినతిపత్రం ఇచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి మండలం వై రామవరం మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

కూనవరం : అంగన్వాడీలు పాత బస్టాండ్ సెంటర్ నుండి ర్యాలీగా వెళ్లి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మీ తనయుడు ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట మరిచారని, ఇప్పటికైనా అంగన్వాడీలకు న్యాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మడెం అన్నపూర్ణ, లక్ష్మి ప్రసన్న, లలిత, అర్జమ్మ, ముత్తమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విఆర్ పురం : మండల కేంద్రం విఆర్ పురంలో అంగన్వాడీలు చేపట్టిన దీక్షా శిబిరాన్ని విఆర్.పురం ఇన్చార్జి సిడిపిఓ నాగలక్ష్మి బృందం సందర్శించి ప్రభుత్వ మెమో నోటీసులు ఇచ్చారు.దీనికి చినమట్టపల్లి ఎంపిటిసి పూనెమ్ ప్రదీప్ కుమార్, యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, ముసురు రాజేశ్వరి అభ్యంతరం వ్యక్తం చేశారు. మాకు నోటీసులు వద్దని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేసేది లేక సిడిపిఓ రామలక్ష్మి నోటీసులు శిబిరం వద్ద ఉంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో నాగమణి, అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా జరుగుతున్న నిరసన శిబిరంలో రిలే నిరహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు గిరిజన సంఘం, సిఐటియు, మిడ్డే మీల్స్, డివైఎఫ్ఐ, తెలుగుదేశం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈ సిరిమల్లె రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె శాంతి రాజు, పి రామరాజు, టిడిపి జిల్లా నాయకులు డి శివరామచంద్రరాజు, జి పెద్దిరాజు, యూనియన్ నాయకులు కె వెంకటలక్ష్మి, సిహెచ్ కుమారి, ఎల్ సత్యవతి, నూక రత్నం పాల్గొన్నారు.

కొయ్యూరు : 22వ రోజు అంగన్వాడీలు మండల కేంద్రంలో భారీ ర్యాలీ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎస్ సూరిబాబు, అంగన్వాడీల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చింతపల్లి: సమస్యలపై సమ్మె చేస్తున్న అంగన్వాడీలు ఈనెల 5లోగా విధుల్లో చేరాలంటూ సిడిపిఓ ద్వారా జిల్లా కలెక్టర్ పంపిన నోటీసులను మంగళవారం చింతపల్లిలో అంగన్వాడీలు తీసుకోకుండా తిరస్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు పాంగి ధనుంజయ్ మాట్లాడుతూ సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకుండా, వారిని విధుల్లో చేరాలని లేకుంటే చర్యలు తప్పవని బెదిరిస్తూ నోటీసులు జారీ చేయడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు. డిమాండ్లను నెరవేర్చకుండా ఉద్యమాన్ని అణిచివేసే ధోరణితో ప్రభుత్వం ముందుకు వెళితే, ఉద్యమం ఉధృతమౌతుందని హెచ్చరించారు. 3న కలెక్టరేట్ల ముట్టడికి అంగన్వాడీలు పిలుపునిచ్చినా, తమకేమీ పట్టనట్లు నోటీసులు జారీ చేయడం అంగన్వాడీ సమస్యలపై ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతోందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు ఎం వరలక్ష్మి, వి.రాజేశ్వరి, కె.లక్ష్మి, ఎస్ కుమారి, పి నీలమ్మ పాల్గొన్నారు



డుంబ్రిగుడలో థింసా నృత్యాలు చేస్తూ నిరసన



కూనవరంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు



ముంచంగిపుట్టులో ఆవుకు వినతిపత్రం అందజేత



చింతపల్లిలో అధికారుల నోటీసులు తిరస్కరిస్తున్న అంగన్వాడీలు

నిర్వాసిత రైతులకు నచ్చిన భూములే ఇవ్వాలి



మాట్లాడుతున్న శ్రీరామగిరి సర్పంచ్ సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసిత రైతులకు ఇచ్చే భూమికి భూమి వారికే నచ్చిన భూములే ఇవ్వాలని శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం నిర్వాసిత రైతులకు ఇవ్వాల్సిన భూమికి సంబంధించి విఆర్.పురం, బుట్టాయిగూడెం తహసీల్దార్ల ఆధ్వర్యాన ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు బాధిత రైతులను మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పరిధి చొక్కనపల్లి గ్రామానికి తీసుకొని వెళ్లి భూమిని చూపించారని తెలిపారు. అయితే ఆ భూమి తమకు నచ్చలేదని రైతులు స్పష్టం చేశారన్నారు. అయినా వినకుండా వేము చూశాం కాబట్టి తీసుకోవాలని ఒక ఎస్‌డిసి చెప్పడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల మెప్పుకోసం రైతులను బెదిరించడం సరికాదని, ఈ చర్యలు తీవ్రంగా ఖండించారు. అధికారులు ఇప్పటికైనా రైతులకు నచ్చిన భూములను ఇవ్వాలని కోరారు. లేదంటే రైతులను తీసుకొని రోడ్డు ఎక్కాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఉన్న వ్యక్తి వద్ద గంజాయి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండల కేంద్రంలో మద్యం మత్తులో అనుమానస్పదంగా కింద పడి దొర్లుతున్న వ్యక్తి వద్ద గంజాయిని పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తి రోడ్డుపై దొర్లుతుండగా, చుట్టుపక్కల షాపుల యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చి కింద పడిన వ్యక్తిని పైకి లేపుతుండగా సదరు వ్యక్తి బాడీలో కొంత గంజాయి చుట్టుకొని ఉండడం గమనించారు. ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉండడం వల్ల ఎటువంటి సమాచారం సేకరించలేదని, స్పృహలోకి రాగానే వివరాలు మీడియాకు వెల్లడిస్తారని ఎస్ఐ రాము తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ప్రమాదాలకు నిలయంగా మారిన మారేడుమిల్లి ప్రధాన రహదారులపై వేగ నిరోధకాలు (స్పీడ్ బ్రేకర్లు) ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ సభ్యులు గొర్లె అనిల్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం పర్యటకానికి ప్రాధాన్యం ఇస్తున్నా, స్థానిక గిరిజనులు మాత్రం బిక్కుబిక్కుమంటు రోడ్డు మీదికి రావలసిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పర్యటక ప్రాంతానికి వస్తున్న వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలకు కట్టడి చేయాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో సబ్ కలెక్టర్, ఎఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం కొత్తపాలెం, కొమ్మ సంపంగి, కొయ్యూరు మండలం మండపల్లి తదితర మారుమూల గ్రామాల్లో పాడేరు సబ్ కలెక్టర్ దాత్రి రెడ్డి, చింతపల్లి ఎఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండపల్లి గ్రామస్తులు తమ సమస్యలు తెలియజేస్తూ.. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం తీసుకోవటానికి తాము 17 కిలోమీటర్ల కాలినడకన వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. రహదారి సౌకర్యం ఉన్నంతవరకు బియ్యం పంపిణీ పీకే వాహనాన్ని పంపించి బియ్యం అందజేయాలని అధికారులకు కోరగా, ఈ విషయంపై ఇన్‌ఛార్జి తహశీల్దారుకు సబ్ కలెక్టర్, ఎఎస్‌పి ఆదేశాలు జారీ చేశారు. మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఆధార్ కేంద్రాన్ని జికె.వీధి సంత రోజు ఏర్పాటు చేయాలని, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని కోరారు. 604 పట్టాల మంజూరుకు సర్వే త్వరగా పూర్తిచేసి ప్రతిపాదనలు పంపాలని ఇన్‌ఛార్జి తహశీల్దారు ఆదేశించారు. ఆధార్ సెంటర్‌పై ఎంపీడీవో ఉమామహేశ్వరరావును ఆదేశించారు. కొమ్మ సంపంగి గుడ్లపనస, చాట్రాయి గ్రామాలకు స్కూల్ భవనాలు ఏర్పాటుకు ప్రతిపాదన పంపిస్తామనిసంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లును సబ్ కలెక్టర్, ఎఎస్‌పి అందజేశారు. పిల్లల్ని బాగా చదివించాలని, యువత గ్రామాల్లోనే ఉండిపోకుండా వివిధ రకాల ఉపాధి మార్గాలను చూసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ అప్పలసూరి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఇన్‌ఛార్జి తహశీల్దారు కుమారస్వామి, ఆర్ఐ మహదేవ్, ఆర్డిఓ పాపారావు, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టరు దాత్రి రెడ్డి, ఎఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

కానిస్టేబుల్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

జిడి కానిస్టేబుల్-2023కు సంబంధించి దరఖాస్తు చేసుకొని, పోలీసు శాఖ నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన 60 మంది గిరిజన యువతీ యువకులకు మారేడుమిల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే తెలిపారు. ఈ మేరకు మంగళవారం శిక్షణకు సంబంధించిన మెటీరియల్ పుస్తకాలను పిఒ గనోరే, రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ ఆడహల్లి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ నిపుణులతో 45 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో ఈ సమయంలో ఉచిత వసతి, భోజనం సౌకర్యం రంపచోడవరం ఐటిడిఎ ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్క యువతీ యువకులు ఉద్యోగాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మారేడిమిల్లి సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐ రాము, దేవీపట్నం ఎస్ఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



మెటీరియల్ అందజేస్తున్న రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, ఎఎస్‌పి జగదీష్ తదితరులు



స్వాధీనం చేసుకున్న నారా సారా తయారీకి ఉపయోగించే సామగ్రి

నాటుసారా బట్టీలపై దాడులు

- 1200 లీటర్ల బెల్లం పులుపు, సామగ్రి ధ్వంసం

- 60 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి- కొయ్యూరు

మండలంలోని సురేంద్రపాలెం గ్రామం శివారులో నాటుసారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించి భారీ ఎత్తున బెల్లం పులుపును ధ్వంసం చేసినట్లు కొయ్యూరు ఎస్సై రాజారావు తెలిపారు. తమకు ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం సీఐ బాజీలాల్ ఆధ్వర్యంలో తమ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని వెల్లడించారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల బెల్లం పులుపు, నాటుసారా తయారీ బట్టీలను, వంట సామగ్రిని, నాటుసారా నిల్వ ఉంచే డ్రమ్ములను ధ్వంసం చేశామని చెప్పారు. ఘటనా స్థలంలో 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్కడ నాటుసారా తయారీకి పాల్పడుతున్న వారిని త్వరలోనే గుర్తించి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎవరైనా నాటుసారా తయారీ, క్రయ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజారావు హెచ్చరించారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-కొయ్యూరు : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎంపిపి బడుగు రమేష్ తెలిపారు. మండలంలోని అంతాడ సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గైనకాలజిస్టు డాక్టర్ సుధాశారద సమక్షంలో వైద్య బందం ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు జల్లి బాబులు, స్థానిక సర్పంచ్ సుర్ల చంద్రరావు, వైసిపి నాయకులు బండి సుధాకర్, గాడి సత్యనారాయణ, రీమల గంగాధర్, ముసిలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి రమేష్, వైద్యులు, సిబ్బంది

విద్యుత్ స్తంభాలను తొలగించి అక్రమ నిర్మాణాలు

పట్టించుకోని రెవెన్యూ, పంచాయతీ అధికారులు



ఇంటి నిర్మాణానికి విద్యుత్‌స్తంభం తొలగిస్తున్న గిరిజనేతరుడు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని కొండవీధిలో విద్యుత్ స్తంభాన్ని తొలగించి, గిరిజనేతరుడు అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం దుర్మార్గమని, తక్షణమే అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు కిండంగి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, మండల కేంద్రంలోని కొండవీధికాలనీలో ఓ గిరిజనేతరుడు దర్జాగా ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా శాశ్వత భవనం నిర్మాణం చేపట్టడమే కాకుండా, దీనికోసం ఆ వీధిలోని స్తంభాలను తొలగిస్తున్నా తమకేమీ పట్టనట్లు అధికారులు వ్యవహరించడంపై మండిపడ్డారు. ఏజెన్సీలో అందులోనూ. అరకులోయ మండలకేంద్రంలో అక్రమ కట్టడాలు నానాటికీఈ పెరిగిపోతున్నా, గిరిజనేతరులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి అధికారులు మిన్నకుండడం సరికాదన్నారు. అక్రమ నిర్మాణాలపై తహశీల్దార్‌కు ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు ఈ అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ప్రక్రియలో అలసత్వం తగదు

శిక్షణకు ఆలస్యంగా వచ్చిన జోనల్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - పాడేరు : ఎన్నికల వ్యవహారాలకు సంబంధించి, సమయపాలనతోపాటు ప్రతి విషయంలోనూ కచ్చితత్వం పాటించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శిక్షణ సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఎన్నికల జోనల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. మంగళవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులతో ఒక రోజు శిక్షణ, అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో జోనల్ అధికారుల బాధ్యతలు, విధి విధానాలపై దిశా నిర్దేశం చేసారు. ఇవిఎంలు, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బందిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇవిఎంలు, వివిప్యాట్లు, పోలింగ్ అధికారులు సిబ్బంది నిర్దేశించిన బస్సులలో మాత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేసారు. మార్గమధ్యలో ఎక్కడా పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వాహనాలను నిలుపుదల చేయకూడదని సూచించారు.. పోలింగ్ ప్రక్రియం ఉదయం ఏడుగంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందన్నారు. మాక్ పోలింగ్, పోలింగ్ ప్రారంభంపై అవగాహన ఉండాలని చెప్పారు. ప్రిసైడింగ్ అధికారుల డైరీ సక్రమంగా నిర్వహించి ఎప్పటికప్పుడు పోలింగ్ శాతాన్ని జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలని ఆదేశించారు. వచ్చే 20 రోజుల్లో జోనల్ అధికారులంతా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి రవాణాకు అనుకూలంగా రహదారులు ఉన్నాయా లేదా పరిశీలించాలని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నివేదించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్, అదనపు పోలీసు బలగాలను నియమిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ జోనల్ అధికారులకు కేటాయించి పోలింగ్ కేంద్రాలను సందర్శించి, స్థానిక సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, పోలీసు అధికారులతో గత అనుభవాలపై చర్చించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించాలన్నారు.రు. పాఠశాలలు లేదా ప్రభుత్వ శాశ్వత భవనాలలో మాత్రమే ఓటింగ్ ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేసారు. రూట్ మ్యాప్‌లను తయారు చేసుకోవాలని సూచించారు.. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన అవసరమైన మౌలిక సదుపాయలపై నివేధించాలన్నారు. సమాపేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ వి.వి.రమణ, ఎస్‌డిసి పి.అంబేద్కర్, పాడేరు, అరకు నియోజక వర్గాల జోనల్ అధికారులు పాల్గొన్నారు.

5న గ్రూప్ 2 మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -అరకులోయ/రూరల్

పేర్లు నమోదు చేసుకున్న ఏపిపిఎస్‌సి గ్రూప్ 2 అభ్యర్థులకు ఈనెల 5న మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పి బాలదేవ్ తెలిపారు. పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ పాల్గొని, గ్రూప్ 2 అభ్యర్థులకు మెటీరియల్ అందజేస్తారని, ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నవారంతా ఆ రోజున ఉదయం 11గంటలకు అరకువేలిలోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయానికి రావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9492131423 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.



పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: పాడిరైతులంతా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని స్థానిక పశువైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ తెలిపారు.మంగళవారం పశువులకు వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ ఎస్ సుబ్బారావు, ఎహెచ్ఎ ఎస్ త్రినాధరావు, ఏ జానకమ్మ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని గన్నేరు పుట్టు, బాకూరు, భీమవరం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ చేశారు. బాకూరు వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ వరప్రసాద్ ఆదేశాలతో వెటర్నరీ అసిస్టెంట్లు పాంగి సన్యాసిరావు, దొన్ను సోదామిని బృందం గ్రామాల్లోకి వెళ్లి పశువులకు టీకాలు చేశారు. గేదెలలో పోలిస్తే ఆవులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుందన్నారు.ఈ నెలాఖరు వరకు గన్నేరుపుట్టు, బాకూరు, భీమవరం సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఈ వ్యాక్సినేషన్ కొనసాగుతుందని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని హుకుంపేట వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు కోరారు. కార్యక్రమంలోడొంకినవలస మాజీ వార్డుమెంబర్ పనసబోయిన కొండన్న, వాలంటీర్లు ఎం.మురళికృష్ణ, సన్యాసి, అప్పన్న, బాలాజీ, సింహాద్రి నాయుడు పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీ మాధవి

ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ సాయం పెంపు

ప్రజాశక్తి - పాడేరు : పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచి ఇస్తున్నామని, లబ్ధిదారులు తమ ఆర్థిక అవసరాలకు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పెంచిన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భగా మాట్లాడుతూ, ఎన్నికల వాగ్దానాన్ని అమలు చేస్తూ, సామాజిక పింఛనను రూ.మూడు వేలకు పెంచామని,. పాడేరు మండలంలో 6788 మంది లబ్ధిదారులకు రూ.2,76,67,500 పెన్షన్ కాసుక లబ్ధి చేకూరుతోందన్నారు. పింఛన్లు కోసం ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వాలంటీర్లు ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నామన్నారు.

ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ మాట్లాడుతూ, సామాజిక పింఛన్లను రూ.3వేలకు పెంచి ఇస్తున్నామని, సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు నెలకు రూ.10వేల పింఛను అందుతోందన్నారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ డి.శాంతలక్ష్మి, ఎంపిడిఒ నవీన్, ఇఒపిఆర్‌డి రమేష్, ఎఎంసి చైర్మన్ పోతంగి సూరిబాబు, గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు పాల్గొన్నారు.

కేబుల్ గోతులతో రోడ్లు పాడు!

▸▸పూర్తిగా పూడ్చి చదునుచేయకపోవడంతో ఇబ్బందులు

▸▸నిర్లక్ష్యంగా వదిలేసిన సెల్ నెట్‌వర్క్ యాజమాన్యాలు



కేబుల్ గోతులను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి: సెల్, కేబుల్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని హర్షంవ్యక్తం చేయాలో, లేకుంటే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు అండర్ గ్రౌండ్ కేబుల్ లైన్ల పుణ్యమాని పాడౌతున్నాయని బాధపడాలో తెలియని స్థితిలో మన్యవాసులు ఆవేదన చెందుతున్నారు. ఒఎఫ్‌సి కేబుల్ ఏర్పాటుకు రోడ్డు వెంబడి తీసిన గోతులను పూర్తిగా పూడ్చకుండా సంబంధిత సంస్థలు వదిలేయడంతో పలు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.

మండలంలో పలు గ్రామాలకు జియో, ఎయిర్ టెల్, బిఎస్ఎన్ఎల్, ఫైబర్ నెట్ వంటి సంస్థలు సెల్ సేవలను అందించేందుకు కేబుల్ లైన్లను ఏర్పాటు చేస్తున్నాయి. దేవరపల్లి మండలాన్ని ఆనుకొని జీనబాడు మీదుగా పినకోట,పెదకోట, హుకుంపేట మండలం ఉప్ప వరకు కేబుల్ లైన్లు కోసం తీసిన గోతులతో రోడ్లు ధ్వంసం అయ్యాయని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. డముకు నుండి లంగుపర్తి, వేంగడ పంచాయతీల మీదుగా హుకుంపేట మండలం పట్టాం వరకు, అలాగే మండలంలో ప్రతి పంచాయతీ కేంద్రాలకు వెళ్లే తారు రోడ్లన్నీ ఇరువైపులా పూర్తిగా ధ్వంసం అయ్యాయిన్నారు. సంబంధిత కేబుల్, సెల్ నెట్‌వర్క్‌ల యాజమాన్యాలనీ ఇష్టానుసారంగా రోడ్డు పక్కల్లో కేబుల్ ఏర్పాటుకు గోతులు తవ్వేసి,తర్వాత వాటిని పూడ్చకుండా, చదును చేయకుండా వదిలేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు పొడుగునా ఇదే పరిస్థితి ఉండడంతో రెండు వైపులా కేబుల్ గోతుల్లోని మట్టి కుంగిపోయి కాలువల్లా ఏర్పడడమే కాకుండా, దీని వల్ల ఏమాత్రం రోడ్డుదిగినా వాహనాలు ప్రమాదానికి గురౌతున్నాయని, అంతేకాక రోడ్డు పాడౌతోందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత సెల్ నెట్‌వర్క్ యాజమాన్యాలు స్పందించి రోడ్డు వెంబడి ఒఎఫ్‌సి ఏర్పాటుకు తీసిన గోతులను పూర్తిగా పూడ్చిపెట్టడంతోపాటు చదునుచేసి పటిష్టం చేయాలని కోరారు. లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

10,11 తేదీలలో గీతం ఎక్సలెన్స్‌మీట్ -2024

ప్రజాశక్తి-మధురవాడ : వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ రెండు రోజుల పాటు నిర్వహించే గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్) 2024ను ఈ నెల 10, 11 తేదీలలో నిర్వహించనున్నట్లు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. మంగళవారం జెమ్-2024 ఆహ్వానం కమిటీతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జెమ్ కన్వీనర్, సీనియర్ ప్రొఫెసర్ కె.అశోక్ మాట్లాడుతూ, ఈ ఏడాది కర్తవ్య పేరిట నిర్వహిస్తున్న జెమ్-24 యువజనోత్సవాన్ని "బాధ్యతాయుతమైన సంస్థల నిర్మాణంలో యువజనుల పాత్రను" తెలిపే విధంగా వివిధ వాణిజ్య అంశాలపై వర్క్‌షాప్‌లు, సమకాలీన కార్పొరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళపై చర్చలతో పాటు స్టార్టప్‌ల ప్రోత్సాహంపై ప్రముఖుల ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పూర్తిగా విద్యార్థులు భాగస్వామ్యులు అయ్యే విధంగా వాణిజ్యరంగంలో విభాగాలు ఏవిధంగా పనిచేస్తాయో అదే విధంగా జెమ్-24 నిర్వహణలో విద్యార్థులు చీఫ్ ఎక్సిక్యూటివ్ ఆఫీసర్, సెక్రటరి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, క్రియేటివ్ డైరక్టర్, కల్చరల్ డైరక్టర్, స్పోర్ట్సు డైరక్టర్, మీడియా డైరక్టర్ హోదాలో అనుభవ పూర్వకంగా తెలుసుకునేందుకు పనిచేస్తారని పేర్కొన్నారు. వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులకు నిర్వహణ సామర్థ్యం పెంచడానికి జెమ్-24 వేదికగా ఉపయోగపడుతుందన్నారు.

జెమ్-24 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఐ.సింధువర్మ మాట్లాడుతూ, యువజనోత్సవంలో భాగంగా విద్యార్థులలో మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను వెలికి తీసే విధంగా యంగ్ మేనేజర్, కౌటిల్య, విజ్ఞాన సభ, బ్రాండ్ ట్రక్, స్నపోలీ, ఇగ్నైటర్స్, పాథ్, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



స్థానికులతో కలిసి నినాదాలు చేస్తున్న లోకనాథం

హైడ్రో పవర్ ప్లాంట్ పనులు ఆపేయాలి

ప్రజాశక్తి - దేవరాపల్లి : దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీలోని బలిపురం సమీపం నుంచి వీలుపర్తి పంచాయతీ మారికకొండ వరకు అదానీ కంపెనీ తలపెట్టిన హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణ నిమిత్తం మట్టి నమూనా పరీక్షల కోసం తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలను మంగళవారం సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పరిశీలించారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర, స్థానిక గిరిజన ప్రజలు ఉన్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ గిరిజనులకు, రైతులకు తీవ్ర నష్టం చేకూర్చే హైడ్రో వపర్ ప్లాంట్ నిర్మాణం తగదని, తక్షణమే పనులు ఆపేయాలని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్లాంట్ పనులు కోసం అదానీ కంపెనీ పర్యవేక్షణలో కొల్‌కతాకు చెందిన కంపెనీ మట్టి నమూనా పరీక్షలు చేయడానికి భూ తవ్వకాలు చేపడుతోందన్నారు. ఈ మట్టి నమూనా తవ్వకాలు చట్ట వ్యతిరేకమైనవన్నారు. గ్రామ సభలు జరపకుండా, ప్రజల ఆమోదం లేకుండా మోసపూరితంగా అదానీ కంపెనీ ఈ తవ్వకాలు జరపడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు ప్రారంభమైతే చింతలపూడి పంచాయతీలోని 9 గ్రామాలు, తామరబ్బ పంచాయతీలో 7 గ్రామాలతో పాటు లక్షలాది వ్యవసాయ భూములు పూర్తిగా ముంపునకు గురవుతారన్నారు. శారదా నది ద్వారానే రైవాడ ఆయకట్టుకు నీరు వస్తుందని, హైడ్రో ప్రాజెక్టు వల్ల నీటి వనరులు ఆయకట్టుకు రాకుండా మొత్తం ఆగిపోయే ప్రమాదముందని అన్నారు. దీనికి సంబంధించి ఇఐఎ రిపోర్టును నేటికీ బహిర్గతం చేయలేదని తెలిపారు. రైవాడకు నీరురాకపోతే ఆయకట్టుపై ఆధారపడిన సుమారు 20 వేల ఎకరాలకు సాగు నీరు అందదన్నారు. విశాఖ నగర ప్రజలకు తాగునీరు సరఫరా చేసే అవకాశం భవిష్యత్‌లో ఉండదని తెలిపారు. ఇంత ప్రమాదం వున్న ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలా అనుమతులు ఇచ్చిందని ప్రశ్నించారు. ఒకవైపున గిరిజనులకు, రైతులకు, విశాఖ నగారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందే అనుమానాలు అనేకం ఉన్నాయని తెలిపారు. వెంటనే హైడ్రో ప్రాజెక్టు పనులు నిలుపుదలకు స్థానిక ఉపముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రైవాడ జలాశయానికి ఎదురయ్యే ముప్పు గురించి సాక్షత్తు రాష్ట్ర జలవనరులశాఖే సవివరమైన నివేదిక ఇచ్చిందని, వాటన్నింటినీ తుంగలోకి తొక్కి అదానీ ప్రయోజనాల కోసం పాటుపడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పర్యావరణానికి ప్రమాదం వచ్చే ఏ కంపెనీలకూ అనుమతులు ఇవ్వరాదని న్యాయ స్థానాలు హెచ్చరిస్తున్నా, అదానీ కంపెనీ పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా ఉండటం హేయమన్నారు. ఇప్పటికైనా వెంటనే మట్టి నమూనా పరీక్షల యంత్రాలను ఆ ప్రాంతాల నుండి తొలగించాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికావల్సి వస్తుందని హెచ్చరించారు.

మోడీ విధానాలు కరోనా కంటే ప్రమాదకరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నరేంద్ర మోడీ విధానాలు కరోనా కంటే ప్రమాదకరమైనవని సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి చంద్రమౌళి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 1006 రోజులకు చేరాయి. దీక్షలో పాల్గొన్న సిఐటియు నాయకులు పిపిఇ కిట్స్ ధరించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వచ్చి లక్షలాది ప్రాణాలు తీసిందని గుర్తుచేశారు. మోడీ ప్రైవేటీకరణ విధానాలు దేశానికి మరింత ప్రమాదకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్‌కు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతోందని, ఆ కంపెనీని ఎట్టిపరిస్థితుల్లోనూ అడుగుపెట్టనిచ్చేది లేదని అన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగం మాత్రమే ప్రజలకు సేవ చేస్తుందన్నారు. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులూ ప్రభుత్వ రంగమే చెల్లిస్తుందన్నారు.

రెవెన్యూ 'రాజకీయం'.. భూములు మాయం

గంభీరం, గండిగుండంల్లో ఆక్రమణలపర్వం

కబ్జారాయుళ్ల చేతుల్లో రూ.కోట్ల విలువైన స్థలాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జిల్లాలోని ఆనందపురం మండలంలోని పలు గ్రామాల్లో సామాన్యుల హక్కుభుక్తంగా ఉన్న భూములు కబ్జారాయుళ్ల గుప్పెట్లోకి వెళ్లిపోతున్నాయి. రూ.కోట్లు విలువైన భూములను అటు రాజకీయ నాయకులు, ఇటు రెవెన్యూలోని కొంతమంది అధికారులు కలసి కొల్లగొడుతున్నారు. దీంతో పేద, సన్న చిన్నకార రైతుల కుటుంబాలకు చెందిన వారు అనాథలై ఏ దిక్కూ లేక లబోదిబోమంటున్నారు. మండలంలోని గంభీరం గ్రామంలో సర్వే నెంబరు 175/2లో కుంచం అప్పలకొండకు 57 సెంట్లు సాగు భూమి ఉండేది. ప్రస్తుతం అప్పలకొండ కుటుంబమే ఈ భూమి సాగు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తోంది. అప్పలకొండను కాదని డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు కనీస ఆధారాలేవీ లేకున్నా సరే వేరే వ్యక్తులకు దీన్ని బదిలీ చేసే యత్నాల్లో నిమ్నగమయ్యారన్నది తెలుస్తోంది. ఆన్‌లైన్ ప్రక్రియ చేయలేనందున అసలు హక్కుదారు అయిన అప్పలకొండను పక్కనపెట్టే చర్యలకు డిప్యూటీ తహశీల్దార్ సిద్ధపడడం వెనక అనేక ఒత్తిళ్లు ఉన్నాయని గ్రామంలో పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి తమ గోడును చెప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ 57 సెంట్ల భూమిని పలువురు నకిలీ వ్యక్తులకు కట్టబెట్టే దిశగా భూ ట్యాంపరింగ్ అయిపోయిందని, ఉన్నతాధికారి వారికి కొమ్ముకాస్తున్నారని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గండిగుండంలోనూ బెదిరింపుల పర్వం

ఇదే మండలంలోని గండిగుండం గ్రామంలో సర్వే నెంబరు 235/8 235/పి, 235/1లోగల 50 సెంట్ల భూమి దళాయి సింహాచలం నుంచి వారసత్వంగా దళాయి అప్పారావుకు వీలునామా ద్వారా సంక్రమించగా ఈ భూమికి ఆన్‌లైన్, భూ సర్వే చేస్తామంటూ స్థానిక అధికార పార్టీకి చెందిన వ్యక్తి భూహక్కుదారులను సంప్రదించినట్టే సంప్రదించి ఆ భూమిపై హక్కు కావాలంటే 50:50 వాటా కావాలని అధికార పార్టీ నేతలు బెదిరింపులకు దిగిన సన్నివేశం తాజాగా నడుస్తోంది. ఈ ఒప్పందానికి సదరు భూ హక్కుదారు అంగీకరించకపోవడంతో 'నీకేంటి సంబంధం ఈ భూమి' అంటూ వైసిపికి చెందిన వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ భూమిలో అప్పటికే ఉన్న బిల్డింగ్ మెటీరియల్, ఇతర సామగ్రిని వైసిపి వ్యక్తులు ధ్వంసం చేశారని అప్పారావు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. ముగ్గురు మహిళలను ఈ భూమిపైకి తీసుకొచ్చి వారికి దఖలు పరిచేందుకు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు పంచాయితీలు ఇప్పటికే ప్రారంభించాడు. కొంత డబ్బు ఇస్తాం భూమి మొత్తం వదిలేయాలని పేదలైన దళాయి కుటుంబంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ 50 సెంట్ల భూమితో ఎలాంటి హక్కూ లేని పైడమ్మ, ఈశ్వరమ్మ, భవాని వంటి పేర్లతో ఈ భూమిని ఆన్‌లైన్‌లో చేసెయ్యాలంటూ స్థానిక పెత్తందారు రెవెన్యూపై ఒత్తిడి తేవడం ఇక్కడ కొనసాగుతోంది. జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు కలుగజేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ ఉన్నతాధికారుల తీరుపై విచారణ జరిపించాలని పై రెండు గ్రామాలకు చెందిన బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



గంభీరంలో కబ్జాదారుల కన్నుపడిన స్థలం



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రియాంక

గ్యాంగ్‌రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒడిశాకు చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా విశాఖ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం జరిగిన కమిటీ సమావేశంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ జి.ప్రియాంక, జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ మాట్లాడుతూ విశాఖపట్నంలో మహిళలపై హింస రోజురోజుకూ పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీలకు రక్షణ లేని నగరంగా విశాఖ మారిపోయిందన్నారు. ఒక పక్క మద్యం, మరో పక్క మాదక ద్రవ్యాలు ఏరులై పారుతూ నగరాన్ని మత్తు నగరంగా మార్చేశాయని తెలిపారు. దీంతో మహిళల పట్ల హింస అడ్డూఅదుపూ లేకుండా పోయిందని అన్నారు. వీటిని నియంత్రించటంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. తాజా గ్యాంగ్‌రేప్ కేసులో నిర్భయ చట్టం ప్రకారం నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత యువతికి నిర్భయ నిధి నుండి ఆర్థిక సహాయాన్ని ఇవ్వాలని, మానసికంగా నిలదొక్కుకునేలా మానసిక వైద్యులతో వైద్యం ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్.విమల, ఆర్.వరలక్ష్మి, కె.మణి, భారతి, సుజాత, వి.ప్రభావతి, కె.అనురాధ, ఎ.పుష్పాంజలి, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం

నగరంలో చోటు చేసుకున్న బాలిక గ్యాంగ్ రేప్ కేసులో పోలీసుల నిర్లక్ష్యం ఉందని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ విమర్శించారు. బాలికపై సామూహిక అత్యాచార సంఘటనలో ముద్దాయిలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహిళా చేతన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు డి.లలిత, న్యాయవాది జహర, భారత నాస్తిక సమాజం నాయకులు రాంప్రభు, విజ్ఞానంద్, ఎయు ఉద్యోగి సిహెచ్.మధు గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఊహించిందే..!

- అమర్, బాబూరావు స్థానంలో కొత్త సమన్వయకర్తలు

- అనకాపల్లికి భరత్ కుమార్

- పాయకరావుపేటకు రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు



భరత్ కుమార్



జోగులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో అనుకున్నట్లే రెండు నియోజకవర్గాల్లో సమన్వయకర్తలను వైసిపి మార్చింది. అయితే ఎవరూ ఊహించని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు ఈసారి టిక్కెట్ ఇవ్వని విషయం స్పష్టంగా తేలిపోవడంతో కొంతమంది ఎవరి ప్రయత్నాలు వారు టిక్కెట్ కోసం ప్రారంభించారు. అనూహ్యంగా ఆ పార్టీ జోగులును తెరమీదకు తెచ్చింది. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం రెండు నియోజకవర్గ సమన్వయకర్తలను ప్రకటించింది. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే బాబూరావును పిలిచి వచ్చే ఎన్నికల్లో కొత్త వారికి టిక్కెట్ ఇస్తామని, విజయానికి పనిచేయాలని సూచించారు. రాజ్యసభ టిక్కెట్ ఇస్తామని బాబూరావుకు ఆశచూపారు. రాజ్యసభ సభ్యుని పదవి వస్తుందో, లేదో తెలీదుగానీ ఎమ్మెల్యే టిక్కెట్ మాత్రం రాదన్న విషయం మంగళవారం రాత్రి ప్రకటించిన సమన్వయకర్తల జాబితాతో అర్ధమైంది. ముందునుంచీ అనుకున్నట్లుగానే అనకాపల్లి టిక్కెట్ వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఇవ్వరని ప్రచారం జరుగుతోంది. ఎక్కడ నుంచి పోటీచేయాలన్న స్పష్టత ఇవ్వకుండానే అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్తను మార్చేశారు. అమర్‌కు పార్టీలో ప్రాధాన్యత తగ్గుతుందన్నట్లు జరుగుతున్న ప్రచారానికి సమన్వయకర్తల మార్పుతో బలం చేకూరినట్లైంది. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా మలసాల భరత్ కుమార్‌ను నియమించింది. కొంతకాలంగా భరత్ కుమార్‌ను వైసిపి రంగంలోకి దించనుందని ప్రచారం సాగుతోంది. అమర్ బదులు భరత్‌ను బరిలోకి దించుతుందని సంకేతాలు కొంతకాలం క్రితమే ఇచ్చింది. అనకాపల్లి టిక్కెట్ దాడి రత్నాకర్‌కు రాదని తెలుసుకున్న పార్టీ సీనియర్ నాయకులు దాడి వీరభద్రరావు వైసిపికి మంగళవారం రాజీనామా చేశారు. అమర్‌కు టిక్కెట్ ఇవ్వకపోతే తన తనయుడు రత్నాకర్‌ను పోటీ చేయించాలని వీరభద్రరావు ఆశించారు. మంగళవారం సమన్వయకర్తలను ప్రకటించడానికి కొన్ని గంటల ముందు ఆయన రాజీనామా చేశారు.

రైటర్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికులను వన్ టౌన్ ప్రాంతంలో పోలీసులు అక్రమంగా అరెస్టులు చేశారని, ఆ సమయంలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు ఎం.ఈశ్వరరావుపై వన్ టౌన్ స్టేషన్ రైటర్ కుమార్ దౌర్జన్యానికి పాల్పడి, విచక్షణారహితంగా కొట్టడం దారుణమని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు అన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రైటర్ కుమార్ చర్యను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా, మహిళా కార్మికులను మగ పోలీసులు ఈడ్చి లాక్కెళ్ళి బలవంతంగా వాహనాలు ఎక్కించారని తెలిపారు. పోలీసుల చర్యను కెవిపిఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రైటర్ కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలని డిమాండ్ చేశారు.

ఉరితాళ్లతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమ్మెలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 14వ రోజైన మంగళవారం దీక్షలు నిర్వహించారు. మెడకు ఉరితాళ్లు బిగించి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే తమకు చావే గతి అని నినదించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ టిడిపి ఎమ్మెల్యే పి.గణబాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.